విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 10, జూలై 2024

కోరం లేక ఆలస్యంగా సమావేశం ప్రారంభం

జడ్పీ సమావేశంలో వాడివేడిగా..ఎమ్మెల్యేలు..ఎంపీలు హాజరు
పాలకవర్గాన్ని తప్పుదోవ పట్టించిన అవినీతి తెర..!
ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు కొరవడ్డాయి
అవమానం జరిగింది మాకు న్యాయం జరగాలని జడ్పీటీసీలు పట్టు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: జడ్పీ సమావేశంలో తాగు నీరు సరఫరా, వైద్యం, అధికారుల తీరు పై వాడివేడిగా చర్చ జరిగింది. మిగతా శాఖలపై మమ అనిపించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభించారు. అనంతపురం జడ్పీ భవనంలో మంగళవారం నిర్వహించిన ఈసమావేశానికి ముఖ్య అతిథిగా అనంతపురం, సత్యసాయి జిల్లా కలెక్టర్లు వినోద్ కుమార్,అభిషేక్‌కుమార్ హాజరుకాగా జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముందు పెనుకొండ జడ్పీటీసీ శ్రీరాములు మరణంతో ఆయన 2 నిమిషాలు మౌనం వహించి నివాళులు అర్పించారు. అనంతరం 2024 ఎన్నికల్లో గెలిచి శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. వీరిలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, కల్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు,గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్‌రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ , మడకశిర ఎమ్మెల్యే ఏం. ఎస్ రాజు , హిందూపూర్ పార్లమెంటు సభ్యులు బి. కె పార్థసారధి , అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ హాజరయ్యారు. కొత్త ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వం హామీ అమలులో భాగంగా పింఛన్ 3 వేలు నుండి 4 వేలు పెంపు హామీని అమలు చేశామని రొల్ల జడ్పీటీసీ సభ్యుడు తీర్మానం ప్రవేశ పెట్టారు. దీంతో చెన్నేకొత్తపల్లి జడ్పీటీసీ మైలారపూ గోవిందరెడ్డి పింఛన్‌పెంచారు కానీ వైసీపీ మద్దతు దారులు పింఛన్ తొలగిస్తున్నారు అంటూ వాగ్వాదం దిగారు. దీంతో అందరూ సభ్యులు ఆయనకు వంతు పాడటంతో ఆదిలోనే సమావేశం రసా భసాగా మారింది. దీంతో హిందూపురం ఎంపి. పి బి.కె.పార్థసారథి కలుగజేసుకొని అందరికీ పింఛన్ ఇస్తామని తెలిపారు. వాగ్వాదం సమిసిపోయిందనుకున్న తరుణంలో గతంలో జడ్పీటీసీలకు అవమానం జరిగిందని మాకు న్యాయం జరిగివరకు సభ ముందుకు సాగనివ్వమని గుడిబండ జడ్పీటీసీ సభ్యులు బూదిరాజు అడ్డతగలడంతో ఏమి జరిగిందో తమకు తెలియదని ఎమ్మెల్యేలు, ఎంపీలు తెలపడంతో డిప్యూటీ సీఈవో లలితాబాయి సభ్యులు అవమానం చేయడమే కాకుండా సభ్యులు ప్రజా సమస్యలు తెలిపేందుకు వెళితే గెటౌట్ అంటూ ధారుణంగా కించపరుస్తూ వ్యవహారిస్తారని జడ్పీటీసీ సభ్యులు మూకుమ్మడిగా డిప్యూటీ సిఇఓపై పిర్యాదు చేయడంతో నూతనంగా ఎన్నికైన టీడీపీఎంపి, ఎమ్మెల్యేలు సభ్యులకు మద్దతు తెలుపుతూ ఆఅధికారి అహంకారం తీరును వారు తప్పు పడుతూ అధికారిపై చర్యలు తీసుకోవాలని సభలో తీర్మానము ప్రవేశ పెట్టారు. కలెక్టర్ కలగజేసుకొని జె.సి.తో విచారణ చేయించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు,ఎంపీలు మద్దుతూ తెలిపారు. సమావేశంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు,కో–ఆప్షన్ సభ్యులు జిల్లాలోని ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. జిల్లాలోని పలు ఆసుపత్రులు అధ్వానంగా మారాయని, రోగులు వాటికి రావాలంటనే భయపడుతున్నారని సభ్యులు మండి పద్దారు.చాలా గ్రామాల్లో శుద్ధంజలం అందడం లేదని, ప్రజలు రోగాల బారిన పడే అవకాశముందని అధికారులను నిలదీశారు. ఇదేసమస్య ప్రతిసమావేశంలోను వింటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వ్యహారిస్తున్నారని జడ్పీ ఛైర్మెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనామక కంపెనీలకు లక్షలు పనులు అప్పజెప్పి నిధులు పక్క దారి పట్టిస్తున్నారని,ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు చేసే అవినీతి పనులతో పాలకవర్గానికి చెడ్డ పేరు తెస్తోందని, ఇలాంటి అధికారులు మాకు వద్దని సరెండర్ చేయాలని కోరిన పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించన కలెక్టర్ విచారణ చేసి చర్యలు చేపడతామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి- జిల్లా కలెక్టర్ వినోద కుమార్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పాటుపడాలి. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారులకు చేరేవరకు అధికారులు కృషిచేయాలి. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకురావాలి. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, జడ్పి డిప్యూటీ సీఈవో లలితాబాయి, ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, తదితరులు సమావేశానికి హాజరైనారు.

జడ్పీ ఛైర్‌పర్సన్ తీరుపై ఎమ్మెల్యే దగ్గుపాటి అసహనం

విశాలాంధ్ర–అనంతపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలి జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు చర్చించకుండా అధికారులు, మీరు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని ఆయన అన్నారు. ముందుగా తొలిసారిగా జడ్పీకి వస్తున్న నేపథ్యంలో అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, బి.కె.పార్థసారథి, సహచర శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూరరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నివాళులర్పించారు.మిగిలిన ఎమ్మెల్యేలతో కలసి సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో దగ్గుపాటి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి తక్కువ బడ్జెట్ విడుదల చేస్తున్నారని.. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒక్క సర్వజనాసుపత్రికి రోజుకు 12 వందల నుంచి 14 వందల వరకు పేషెంట్లు వస్తున్నారని.. దీనికి తోడు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి సేవలు కూడా ప్రారంభమయ్యాన్నారు. అయితే ప్రస్తుతం నాలుగైదు వందలమందికిసరిపడా బడ్జెట్ మాత్రమే విడుదల చేస్తున్నారని దీనిని పెంచాలన్నారు. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. ఎంపీ, ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లినప్పుడు చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వాటన్నింటినీ త్వరలోనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.మరోవైపు జిల్లాలో చాలా ప్రజా సమస్యలు ఉండగా.. సమావేశంలో అధికారులు, జడ్పీ ఛైర్ పర్సన్ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ చర్చ సరిగా సాగడం లేదని దగ్గుపాటి అన్నారు. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో ఏఅభివృద్ధి పనులు చేశారో చెప్పాలన్న దగ్గుపాటి డిమాండ్ చేశారు. అధికారులు, జడ్పీ ఛైర్ పర్సన్ ప్రజా సమస్యలపై చర్చలు జరపాలని ఆయన సూచించారు. దగ్గుపాటి చేసినవ్యాఖ్యలు మరికొందరు జడ్పీటీసీలు మద్దతు పలికారు. ముందు ప్రజా సమస్యలు చర్చించాలని డిమాండ్ చేశారు.

12న సాధారణ సర్వసభ్య సమావేశం- ఎంపీడీవో బంగారమ్మ

విశాలాంధ్ర–గుడిబండ: మండల సాధారణ సర్వసభ్య సమావేశం 12న శుక్రవారం ఉంటుందని ఎంపీడీవో బంగారమ్మ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని జడ్పిటిసిసభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరవ్వాలని కోరారు.

15న జిల్లా కలెక్టర్ ఎదుట రైతుల ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ఫ్యాక్టరీల ద్వారా వెదజల్లే కాలుష్యంతో వంటపొలాలు దెబ్బతింటున్న రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప, సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున పిలుపునిచ్చారు. అందులో భాగంగానే నేమకల్లులో మంగళవారం ఉద్యమం ఉధృతం చేయడం కోసం రైతుసంఘం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నష్టపోతున్న రైతన్నలకు ఎకరాకు రూ.30 వేల నుండి 40 వేల వరకు పంట నష్టపరిహారం అందజేసేలా చూడాలని డిమాండ్ చేశారు.సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌ఏపి రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు నరసింహులు, మండల కార్యదర్శిప్రశాంత్, సీపీఐ నాయకులు, రైతన్నలు ఓసిగిరప్ప, రామాంజనేయులు, మల్లప్ప, గోవిందప్ప, సిద్ధు, హనుమంతవాయ, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నేతల ఫొటోలు అందించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర–గోరంట్ల: రాష్ట్ర బిసీ సంక్షేమ శాఖ,చేనేత, జౌళిశాఖమంత్రి సవిత, హిందూపురం పార్లమెంటు సభ్యుడు బి.కే.పార్థసారథి ఆదేశాల మేరకు గోరంట్ల మండలంలోని పాలసముద్రం సచివాలయ కార్యాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల ఫోటోలను పాలసముద్రం పంచాయతీకి పార్టీ నాయకులు అందజేశారు. ఈకార్యక్రమంలో బెల్లాల చెరువు చంద్ర (టీడీపీ రాష్ట్ర వాల్మీకి బోయ సాధికారత సమితి స్టేట్ మెంబర్), మనోహర్ (క్లస్టర్ ఇంచార్జ్), కె. మూర్తి, గంగాధర్, అంజినప్ప (సన్నీ), ఇర్షాద్, అంజి,కాటేపల్లి అంజి, ఈ. నరసింహులు, మల్లి కార్జున, ఉదయ్, శంకర్, శ్రీనివాసులు, గంగాధర్, మారుతి,చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర–రాప్తాడు: గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం సందర్భంగా సుమారు 80మంది గర్భవతులకు రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బి.పి, షుగర్, రక్త పరీక్షలు, బరువు తదితర పరీక్షలు చేశారు.ఇందులో ప్రమాదకర గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు శివకృష్ణ, శ్రావణి మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారము, ఆకుకూరలు పండ్లు, చిక్కీలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈసందర్భంగా శ్రీవాణి ప్యాకేజీ ఇండస్ట్రీస్ యజమానులు గంగాదేవి, ఉదయశంకర్‌రెడ్డి వచ్చిన గర్భవతులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీహెచ్ వో శివప్రసాద్, సూపర్వైజర్లు నరసింహ, అరుణ, ఫార్మసీస్ట్ మూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, ఎంఎల్ హెచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర–కూడేరు: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మొహరం వేడుకలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని కూడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివరాముడు పేర్కొన్నారు. మొహరం పండగ సందర్భంగా పీర్ల చావడి ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి ఉండాలన్నారు. గ్రామపెద్దలు ఏదైనా సంఘటన జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకుంటే పోలీసులు అన్ని విధాల మీకి సహకారం అందిస్తారని, ఎవరైనా ఆకతాయిలో అల్లర్లకు పాల్పడాలని చూస్తే పోలీసులు వారి పీచమనస్తారని సర్కిల్ ఇన్స్పెక్టర్ శివరాముడు తనదైన శైలిలో హెచ్చరించారు.

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్ వితరణ



విశాలాంధ్ర–చిలమత్తూరు రూరల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వారం ప్రోటో విలేజ్ స్వచ్ఛంద సంస్థ వారు రెండు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్ అందజేసినారు మరొక రెండు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్ కూడా ఇస్తామని వాగ్దానం చేశారు ఈ కార్యక్రమంలో ప్రోటోవిలేజ్‌కి సంబంధించిన కృష్ణ కుమారి, కళ్యాణ్న,వంశీ, నవీన్ తహసిల్దార్ భాగ్యలత, మెడికల్ ఆఫీసర్ తేజస్విని డాక్టర్ రామకృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర–హిందూపురం :పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు, సంతేబిదనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు వై. అనురాధ మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు వై.అనురాధ మాట్లాడుతూ, జలుబు, దగ్గు జ్వరము, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ మొదలైన వ్యాధులు ఎలా వస్తాయన్న వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుభ్రమైన ఆహారం తీసుకోవాలని వేడి నీళ్లు తాగాలని, దోమతెరలు వాడాలని, వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని, మొదలైన వాటిని వాడడం వల్ల సీజన్ల వ్యాధులు దరిచేరవని వారు తెలిపారు. విద్యార్థులను వారికి కావలసిన మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాదారులకు నోటీసులివ్వండి-ఎమ్మెల్యే దగ్గుపాటి

విశాలాంధ్ర–అనంతపురం: అనంతపురం నగరంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సీరియస్ అయ్యారు. మంగళవారం ఉదయం నగరంలోని ఎన్టీయార్ మార్గ్ రోడ్డు, సెంట్రల్ పార్క్ స్థలాన్ని ఆయన స్థానిక టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో సుమారు 15ఏళ్లుగా ఉన్న సమస్యపై ఆరా తీశారు. స్థలయజమానులతో మాట్లాడారు. సెంట్రల్ పార్క్‌స్థలం మ్యాప్ పరిశీలించారు. గతంలో ఎంతఉంది.. ఇప్పుడు ఎంత మేరస్థలం కబ్జాకు గురైందన్నది తెలుసుకున్నారు.ఈసందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఏడెకరాలకు వరకు సెంట్రల్ పార్క్‌స్థలంలో మూడెకరాలు కబ్జాకు గురైందన్నారు. ఇందులో వైసీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోందని.. ఇక్కడ ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించమన్నారు. వెంటనే నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. మరోవైపు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్టీఆర్ మార్గ్‌స్థల వివాదానికి త్వరలోనే ముగింపు పలుకుతామన్నారు. కేవలం 30 సెంట్ల స్థల వివాదం ఉందని.. స్థలయజమానులకు తగిన పరిహారం ఇప్పించి.. సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. పాతూరు మీదుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు ముగింపు పలుకుతామన్నారు. మరోవైపు నగరంలో ఎవరైనా ప్రభుత్వ లేదా నగర పాలక సంస్థ స్థలాల్ని ఆక్రమించారని తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటికి నోటీసులు ఇప్పిస్తామని.. ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆక్రమణల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించమని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక జారీ చేశారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి

విశాలాంధ్ర–గుడిబండ:సత్‌ప్రవర్తన కలిగినపౌరులను తీర్చి దిద్దిన ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం సేవలు మరువ లేనివని మండల విద్యాధికారి రవిచంద్రకుమార్, అమరాపురం మండల విద్యాధికారి రాఘవయ్యలు పేర్కొన్నారు. జంబులబండ జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తున్న విశ్వనాథం మంగళవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా పాఠశాలలో సత్కార సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ సమాజంలో గురువుకున్న ప్రాధాన్యత ఎవరికి లేదన్నారు. దేశ భవిష్యత్తు గురువులపై ఆధారపడి ఉందన్నారు.జూనియర్ ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పదవి విరమణ అనేది ప్రతి ఒక్క రంగంలో తప్పనిసరి. ఆయన శేషజీవితంలో కూడా సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఆయన పాఠశాలను వదలి వెళుతున్నారని దిగులు చెందిన విద్యార్థులు కన్నీటి పర్యంతం కావడం ఆయన నిబద్ధత, సేవకు నిదర్శనమన్నారు. ప్రతిఒక్క ఉపాధ్యాయులకు కూడా ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని పిల్లలను సన్మార్గంలో నడిపే మంచి విద్యాబుద్ధులు తయారు చేసి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు పండితులు గంగులప్ప విశ్వనాథంపై రాసిన కవిత ఆహూతులను ఆకట్టుకుంది. ఈసందర్భంగా విద్యార్థినిలు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆయన పదవీ విరమణ సభకు చుట్టు పక్కల మండలాలైన అమరాపురం, మడకశిర, కదిరి, నల్లచెరువు, నంబులపూలకుంట మండలాల నుంచి ఆయనతో పాటు పని చేసిన ఉపాధ్యాయులు, శిష్యులు, స్నేహితులు పెద్దఎత్తున పాల్గొని సన్మానించారు. ఈకార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీపీఎస్ నాయకుడు రామాంజినేయులు, సీనియర్ జర్నలిస్టు కేవి చంద్రాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థలవివాదంలో అక్కపై

గొడ్డలితో దాడి తమ్ముడి అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: గార్లదిన్నె మండల పరిధిలోని పెనకచర్లలో అక్క మహబూబిపై గొడ్డలితో దాడి చేసిన తమ్ముడు జిలానిని గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. స్థల విషయంలో అక్క, తమ్ముడిల మధ్య మంగళవారం గొడవ తలెత్తిందని...ఇదే విషయంలో తమ్ముడు జిలాని స్వయాన తన అక్కమహబూబిపై గొడ్డలితో దాడి చేశాడన్నారు. గాయపడిన అక్క ఆసుపత్రిలో చికిత్స పొందుతోందన్నారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి గొడ్డలితో దాడి చేసిన తమ్ముడు జిలానిని అరెస్టు చేశారన్నారు.

గేట్ పరీక్షలో ఓటిపిఆర్ఐ విద్యార్థులు విజయభేరి

విశాలాంధ్ర– జేఎన్టీయూఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల ఓటిపిఆర్ఐ విద్యార్థులు గేట్ ప్రవేశ పరీక్షలో విజయభేరి మోగించాలని అని డైరెక్టర్ ఆచార్య బి దుర్గాప్రసాద్ తెలిపారు. పరీక్ష ఫలితాలలో కె జాహ్నవి 1374, కె గణేష్ 1650, కె. గురు చరణ్ 1753,వి ప్రేమలత 2228, డి హేమంత్ 3098, అనిల్ కుమార్ 3889, విజ్ఞత 4523, యశ్వంత్ 5352, శ్రీనాథ్ 5789 మొదలగు విద్యార్థులు 19 మంది పరీక్షల్లో విజయ శిఖరాలను అధిరోహించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్ వి సత్యనారాయణ , డైరెక్టర్, ప్రిన్సిపల్ అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

చెరుకూరులో చెరువు మరమ్మతులు పూడికతీత

విశాలాంధ్ర–రొద్దం: మండల పరిధి చేర్కూరులో మంగళవారం టింబకుట కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బబ్లు గంగూలి చెరువు మరమ్మత్తులు పూడిక తీత పనులు పనులు ప్రారంభించారు. దాదాపు సంస్థ 34 సంవత్సరాల మహిళలు రైతులు వికలాంగులు పిల్లలు వ్యవసాయ కూలీలు కళాకారులు పర్యావరణ ద్వారా పనిచేయడం జరుగుతుందని, పర్యావరణంలో భాగంగా ఉమ్మడి భూములు సంరక్షణ అభివృద్ధిలో భాగంగా చెరువుల మరమ్మత్తులు పూడిక పనులు చేయడం జరుగుతుందని, ఈపనులు రొద్దం, రామగిరి, చెన్నై కొత్తపల్లి మండలంలో అభివృద్ధి పని చేపట్టడం జరుగుతుంది. రొద్దం మండలంలో కోవిరా, కంబాలపల్లి, షాపురం, దొడగట్ట తదితర 16 గ్రామాల్లో భూమి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్, ఆయా శాఖ మేనేజర్లు యోగేష్, రమేష్, కోఆర్డినేటర్ రవి, పర్యావరణ కమిటీ సభ్యులు, రైతులు సభ్యులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలపై ర్యాలీ

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం పై మంగళవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ ఎల్లోజిరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో సీజనల్ వ్యాధులు దరి చేర కుండా ఉండాలంటే మురికి కుంటలు,మురికి కాలువలు, నీరునిల్వ ప్రాంతాల్లో పిచికారి చేయాలన్నారు.

ప్రధానమంత్రి మాతృత్వ సురక్షపై అవగాహన

విశాలాంధ్ర–ఉరవకొండ: వజ్రకరూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం డా. తేజస్వీ పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పని డాక్టర్ తేజస్వి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహార పదార్థాలు తీసుకోవాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతోనే పిల్లలలో,పెద్దలలో అతిసార వ్యాధి నివారించవచ్చన్నారు. అతిసారను తగ్గించడానికి ఓ ఆర్ ఎస్,జింక్ మాత్రలను తప్పకుండా వాడాలని గర్భవతులకు సూచించారు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర–ధర్మవరం: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సెట్టిపీ జయచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఎల్ సి కె పురం పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య, నూతన అప్గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల పోస్టుల మంజూరు, బదిలీలు, ప్రమోషన్లు, మున్సిపల్ పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా పోస్టుల సర్దుబాటు, జీవో నెంబర్ 117 తక్షణం రద్దు చేయాలని యుటిఎఫ్ తరపున వారు డిమాండ్ చేశారు. తొలుత వారు ధర్మవరం మున్సిపాలిటీ నందు ఉపాధ్యాయుల యుటిఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2016 లో ఇచ్చిన మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ను సవరణ చేస్తూ, విద్యా శాఖ జీవో నెం. 7, 8, 9, 10 లను విడుదల చేసింది అని,ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల బదిలీలు, ప్రమోషన్స్ ప్రక్రియ నిలచి పోవడం జరిగిందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పిఎఫ్ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేకపోవడం దారుణం అన్నారు. నూతన మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీ పాఠశాలను కూడా మునిసిపల్ పాఠశాలలుగానే గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామకృష్ణ నాయక్, ధర్మవరం యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, సాయి గణేష్, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, హరి శంకర్, ఆంజనేయులు, మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ జలాశయంలో 22 టీఎంసీల నీరు

విశాలాంధ్ర–బొమ్మనహాళ్:తుంగభద్ర జలాశయంలో మంగళవారం నాటికి 22.825 టీఎంసీల చేరాయి. ఇన్ఫ్లో మంగళవారం ఉదయానికి 23,0079 క్యూసెక్కులకువస్తున్నాయి. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 22.825 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్లో 156 క్యూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1600.99 అడుగు వరకు నీరు చేరాయి. జలాశయంలోకి వరద నీరు ప్రవాహం హెచ్చుతగ్గలతో వస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు నివారణ

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని బొమ్మనహాల్ హెల్త్ అసిస్టెంట్లు జైనబి, గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్‌లో మలేరియా, డెంగ్యూ, చికున్‌గన్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నివారణ చర్యలపై ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల, దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా లాంటీ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా దోమల తెరలు వాడలని చెప్పారు. డయేరియాపై అవగాహన కల్పించారు.

గర్భిణీ స్త్రీలకు భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర–తాడిపత్రి: పట్టణంలోని వైయస్సార్ ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం అరవింద నారాయణరెడ్డి సహకారముతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 9న వైఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు వారి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ ఉచితంగా భోజనం, విటమిన్ సీరఫ్ దాదాపు ఐదు నెలల పంపిణీ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ మహిళ ప్రెసిడెంట్ అనూరాధ లయన్స్‌క్లబ్ సభ్యులు నాగేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మిఆసుపత్రి వైద్యులు ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నిక



విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఫ్యాక్టరీల వల్ల చుట్టుపక్కల పంట పొలాల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రైతులకు పంట నష్ట పరిహారం సక్రమంగా అందేలా గ్రామరైతు సంఘం కమిటీ సభ్యులు పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప, సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున అన్నారు. మంగళవారం నేమకల్లు గ్రామంలో రైతు సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం కమిటీ అధ్యక్షులుగా వసికేరప్ప, ఉపాధ్యక్షులుగా గోవిందప్ప, కార్యదర్శిగా రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా మల్లప్ప, కోశాధికారిగా సిద్ధనగౌడ్, సభ్యులుగా వంద్రప్ప, ప్రకాష్, హనుమక్క, అనంతమ్మ, గొల్లనాగప్ప, హనుమంతురెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు నరసింహులు, మండల కార్యదర్శి ప్రశాంత్, కనేకల్ మండల కార్యదర్శి గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా చౌక ధాన్యం స్వాధీనం.. ముద్దాయిలు అరెస్టు



విశాలాంధ్ర–అమడగూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై మక్బూల్‌భాష, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య,వీఆర్వో ప వన్ పోలీస్ సిబ్బంది సుధాకర్, భాస్కర్, జెబిఉల్లాలు మంగళ వారం మారుతి పురం గ్రామ శివారులలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా రాబడిన సమాచారం మేరకు ఆంధ్ర నుండి కర్ణాటక రాష్ట్రానికి 3 టన్నుల ప్రభుత్వ చౌకధాన్యాన్ని తరలిస్తున్న బులోరా వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ముద్దాయిలు బొట్టు సుధాకర్, బిల్లూరు రవి, డ్రైవర్ బాబులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు.

మొహరానికి పోలీసుల అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మొహరం పండుగను జరుపుకోవడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో వర్గపోరుకు గానీ, పాత కక్షలతో గొడవలు పడటం కానీ మొహరం వేడుకల్లో చేయకూడదన్నారు. అందరూ కలిసి కట్టుగా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన మండల ప్రజలకు సూచించారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, బుధవారం 10, జూలై 2024

జెసిబిలతో పేదల గుడిసెలు కూల్చేసిన రెవెన్యూ అధికారులు

గుడిసెలు తొలగించిన చోటే పట్టాలి ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్

విశాలాంధ్ర-సోమందేపల్లి: సోమందేపల్లి మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 700లో గల సీపీఐ జిల్లా నాయకులఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలంలో ఇల్లు లేని నిరుపేదలు వైసిపి హయాంలో 7 నెలల కిందట గుడిసెలు వేసుకోవడం జరిగింది. గుడిసెలు వేసుకున్న కొన్నాళ్లకే రెవెన్యూ సిబ్బంది అప్పుడే అక్కడ కూల్చి వేయడం ప్రారంభించారు, అయితే సిపిఐ చొరవతో మళ్లీ ఆ చోటనేపేదలు ఇల్లు నిర్మించాలని నిర్ణయించుకోవడం జరిగింది అక్కడ ఉన్న నిరుపేదలు వాటిని ఇల్లుగా మలుచుకొని అప్పు సప్పు చేసుకుంటూ ఇల్లు నిర్మిస్తూ నిర్మించుకుంటూ జీవనం కొనసాగిస్తూ వచ్చారు. అంతలోనే మంగళవారం తెల్లవారుజామున రెవెన్యూ సిబ్బంది పంచాయతీ కార్మికులు పోలీసుల సహకారంతో పేదల ఇల్లు జెసిబి లతో కూల్చివేయడంతో పేదలు నిర్మించుకున్న ఇల్లు నేలమట్టం అవడంతో బాధితులు బోరున విలపించారు, ఈ స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి వీల్లేదు అంటూ గుడిసెలు తీసేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చామని చెబుతుండగా మాకు నోటీసు ఇవ్వలేదని సిపిఐ మండల కార్యదర్శి బాలు స్వామి తెలపడం చర్చనీయం అయింది అదేవిధంగా బాధితులు మాట్లాడుతూ తాము 7 8 నెలలుగా ఇక్కడ కాపురాలు ఉంటూ భోజనం చేసుకుంటూ ఇల్లు నిర్మించుకుంటున్నామని చాలా వరకు అప్పు చేసామని ఒక్కో ఇంటికి దాదాపు 50 నుంచి లక్ష దాకా ఖర్చయిందని ఇప్పుడు మా బాధలు అప్పు ఎవరు తీర్చగలరని అధికారులు ముందు ఆవేదన వ్యక్తం చేశారు తమకు ఇల్లు లేవని విచారించితమకు న్యాయం చేయాలని ఇటుకలు లేదా మా సామాగ్రి తోలుకోవడానికి అవకాశమైనా ఇవ్వాలంటూ రెవెన్యూ పోలీస్ అధికారుల ముందు బాధితులు కన్నీరు మున్నీరు అవడం చూపరులను బాధ కలిగించింది తమకు ఆత్మహత్య శరణ్యమని అధికారుల ముందు ఆర్తనాదాలు చేశారు , సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి నిరసన చేయడంతో ఆయనతో పాటుగుడిసెలు వేసుకున్న కొంతమందిని స్టేషన్కు తరలించారు,విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా నాయకులు రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్యసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కానీ శెట్టిపల్లి వినోద్ కుమార్ కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలో సర్వే నెంబర్ 700 లో గత సంవత్సరం కాలంగా రూములు కట్టుకొని కాపురాలు ఉంటున్న నిరుపేదల గుడిసెలను ఇండ్లను రెవిన్యూ అధికారులు పోలీస్ సిబ్బంది తెల్లవారుజామున మూడు గంటల సమయంలో తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు.బాధితులతో కలిసి సోమందేపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమం చేపట్టారుదౌర్జన్యంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరైనది కాదని అడ్డుకున్న సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి సహాయ కార్యదర్శి చాంద్ బాషా ఇతరులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించినట్లు రెవిన్యూ మరియు పోలీస్ అధికారులు అత్యుత్సాహం చూపించారని పేదల పట్ల కనికరం లేకుండా మహిళలని చూడకుండా ఈడుచుకుంటూ వెళ్లి అరెస్ట్ చేసి ఇండ్లను కూల్చడం దుర్మార్గమని పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకు తమ పోరాటం ఆగదని తెలిపారు సందర్భంగా పేదలు వేసుకున్న గుడిసెలు సంఘటన స్థలానికి వెళ్లి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య కాటమయ్య వినోద్ కుమార్ బాలస్వామి చాంద్ భాషా తదితరులు వెళ్లి పరిశీలించారు ఈకార్యక్రమంలో సిపిఐ హిందూపురం సిపిఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చలపతి, సిపిఐ నాయకులు కమల్ భాష, నౌషాద్, జిలాన్, గంగాధర్, జియా, చాంద్ భాష, శివ, బాబా, శీనా, షబ్బీర్, మహిళలు అంజనమ్మ, నూర్జహాన్, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మారింది సారూ.. జిల్లాలు మారిన బోర్డుల్లో పేరు మారలేదు..!

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో పలు కార్యాలయాలకు చెందిన పేర్ల బోర్డులో పాతజిల్లాల పేర్లను మార్చి కొత్తగా ఏర్పాటైనప్పటికీ కొత్త జిల్లా పేర్లను బోర్డులో పొందు పరచాల్సిన అధికారులు ఇంతవరకు ఆధ్యాసే మరచి పోయారు. ఏపీలో పునర్వి భజనలో భాగంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్పు చేయడం అందరికి తెలిసిన విషయమే. కదిరి తా లూకా గతంలో అనంతపురం జిల్లా నుండి శ్రీసత్యసాయి జిల్లాగా 03.04.2022లో మార్పు చేశారు. కానీ పట్టణం లో ప్రభుత్వ బాలికల కళాశాల, ఔషద తనిఖీ అధికారి కా ర్యాలయం, కుటాగుళ్ల వద్ద 33.కె.వి. విద్యుత్ ఉప కేంద్ర కార్యాలయం, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలకు సం బంధించిన బోర్డులో నేటికీ మారిన జిల్లా (శ్రీ సత్యసాయి) మార్పు చెయ్యలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఏమిటీ ఈ నిర్లక్ష్యం అధికారుల వైఫల్యమే కారణమా? లేక తెలిసిన పట్టించుకోవడం లేదా? అని ప్రజల్లో చర్చనీయంగా మారింది. ఇది ఎవరి నిర్లక్ష్యం సామాన్యులకు అందుబాటులో ఉంచాల్సిన వివరాలపై కనీస బాధ్యత కూడా లేకుండా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరును ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులలో మార్పు వచ్చి బోర్డులో కొత్త జిల్లా పేరు పొందు పరుస్తారో లేదో వేచి చూద్దాం.

ప్రమాద బాధితునికి పరామర్శ

విశాలాంధ్ర-పెనుకొండ: మండలం కొండంపల్లిలోని గంగప్ప ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. బీసి సంక్షేమం, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత భర్త వెంకటేస్వరరావు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడికి అండగా ఉంటామని ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని తెలిపారు. ఆయనతో పాటుగా నాయకులు మాజీ సర్పంచ్ ప్రసాద్ గోపాల్, సర్పంచు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, ముత్యాలనాయక్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు పౌష్టికాహారం అందజేసిన మంత్రి

విశాలాంధ్ర-సోమందేపల్లి: సోమందేపల్లి మండల కేంద్రంకు ప్రభుత్వ వైద్యశాలకు విచ్చేసే గర్భిణీలకు ఐదేళ్లుగా పౌష్టికాహారం, అన్నదాన కార్య క్రమం నిర్వహిస్తున్న బీసీ సంక్షేమం, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత పెనుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని గర్భిణీలకి రెండేళ్లుగా ప్రతినెల పౌష్టిక ఆహారం,అన్నదానం చేస్తున్న బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ ఈ సందర్భంగా గర్భిణీలకు మంత్రి భర్త వెంకటేశ్వరరావు భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదానం చేయడంలోనే సంతృప్తి ఉందని గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం కోసం ఆసుపత్రిలను ఎంచుకొని అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నాక్యాంటీన్ నిర్వహిస్తున్నామని వివరించారు. ఆయనతో పాటుగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎప్.పి. షాపులు కిరాణా దుకాణలను తనిఖీ

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని పిల్లి గుండ్లు, అలుపన పల్లి దొడ్డేరి, గుడ్డుగురికి తదితర గ్రామాల్లోని కిరాణ దుకాణాలు ఎప్.పి. షాపులను హిందూపురం లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్.పి షాప్ నిర్వాహకులు.. కిరాణా దుకాణదారులు ప్రజలకు అందించే నిత్యావసరాలు పంపిణిలో ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. అలా తూకల్లో మోసాలకు పాల్పడితే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం కిరాణా దుకాణాల్లో ఉన్న తూనికలు కొలతలను పరిశీలించి వాటిని గుర్తించి సీల్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రోలజీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనం కల్పించే పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

విశాలాంధ్ర-ఓబుల దేవర చెరువు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే ఉపాధి పనులు రైతులకు ఉపయోగకరంగా ఉన్నవాటికి ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నూతన ఉపాధిహామీ పథకంలో నూతన ఫీల్డ్ అసిస్టెంట్లుగా చేపట్టే వారి జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెంట్ పూలరెడ్డప్ప, ఈఓఆర్డి రాజశేఖరలకు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ 90 శాతం ఫీల్డ్ అసిస్టెంట్లును ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అభ్యర్థులకు కేటాయించి సామాజిక న్యాయం చేయడం జరిగిందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియామకం అయిన వారు ప్రజలకు ఉపాధి పనులు సంవృద్ధిగా కల్పించి వలసల నివారణకు కృషి చెయ్యాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, డా.జాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి మంత్రి భర్త నివాళి

విశాలాంధ్ర-సోమందేపల్లి : మండల పరిధిలోని తుంగోడు గ్రామంలో మంగళవారం టీడీపీ కార్యకర్త ఆంజనేయులు (55) గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందచేసి, ఆంజనేయులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల పునాది నుండి పుట్టిన పార్టీ టీడీపీ

విశాలాంధ్ర-పెనుకొండ: ఎన్టీఆర్ జిల్లా, గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్ ను బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పరిశీలించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ బీసీల పునాది నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అన్నారు.బీసీలకు మాయ మాటలు చెప్పి మోసం చేసిన పార్టీ వైసీపీ చరిత్రలో మిగిలిపోయిందన్నారు. నా బడుగులని ఓట్లు వేయించు కొని బీసీలను అన్నిరంగాల్లో మోసం చేసింది జగన్ రెడ్డి అన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం టీడీపీ అని మంత్రి మరో మారు గుర్తు చేశారు. గొప్పల కోసమే కార్పొరేషన్ల ఏర్పాటు, కార్పొరేషన్‌తో ఒక్క బీసీ కూడా బాగు పడింది లేదన్నారు. అలాంటి బీసీలకు పూర్వ వైభవం తెస్తామని మంత్రి సవితమ్మ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమస్యలు పరిటాల సాయంతో మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

విశాలాంధ్ర-ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలెకొన్న సమస్యలు పరిటాల శ్రీరామ్ ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని ఆ పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పేర్కొన్నారు.మంగళవారం మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి రాజేంద్రతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీజన్ వ్యాధులపై ప్రత్యేకదృష్టి పెట్టారని, మండలంలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా తుమ్మల మనోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ముదిగుబ్బ ప్రభుత్వాసుపత్రిలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 143 జీవో ప్రకారం గతంలో వైద్య అధికారులు ఇద్దరు, ఏఎన్ఎంలు 5మంది, సూపర్వైజర్లు6మంది, హెల్త్ అసిస్టెంట్లు ముగ్గురు, స్టాఫ్ నర్స్ లు ఇద్దరూ , ఒక అటెండర్, ఒక చీపర్, ఒక డ్రైవర్ ను మొత్తం మీద 21 మందిని బదిలీ చేశారని,అయితే మలకవేమల ప్రభుత్వాసుపత్రి పరిధిలోకి కేవలం-4 సచివాలయాలు మాత్రమే వస్తాయి. ముదిగుబ్బ ప్రభుత్వాసుపత్రి పరిధిలోకి 17 సచివాలయాలు వస్తాయని, ఉన్న సిబ్బందికి పనిభారం అధికమవుతోందని, వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి అభివృద్ధిలో ఏ భవనాల నిర్మించక పోవడం, రోగులకు యంత్రాలు అందుబాటులో లేకపోవడం బాధాకరమని,పైసమస్యలన్నీ వైద్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 60 మంది హైరిస్క్ గర్భిణీలకు పరీక్షలు నిర్వహిస్తున్నరు, గర్భిణీలకు పౌష్టిక ఆహారం అవసరమని యాపిల్ పండ్లు, స్వీట్లు క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పంచిపెట్టారు.

మంత్రిగారూ .. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్‌ని కొనసాగించాల్సిందే..!

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని శ్రీసత్యసాయిజిల్లా ఏపీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బండిశివ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చేరుటకు డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆనోటిఫికేషన్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు కోసం బీకాం జనరల్ కోర్సును చాలామంది విద్యార్థులు చదవడానికి శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగిస్తున్నట్లు ప్రకటిస్తూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలా చేయడంవల్ల ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు లేక మూతపడుతున్న పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కనబడుతోందని తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుగుతున్న సందర్భంగా ఇప్పటికి ఆన్లైన్లో రిజర్వేషన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ ఆప్షన్ కనిపించడం లేదని, కానీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మాత్రం బీకాం జనరల్ కోర్స్ కనపడుతోందని తెలిపారు. కావున దీనిపైన తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని వారి విజ్ఞప్తి చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతున్న సందర్భంగా ఇప్పటిలోపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోసం కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీఎస్ ఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎస్ఎఫ్ ధర్మవరం పట్టణ నాయకులు నవీన్, స్వామి, ఉదయ్, పవన్, మల్లి తదితరులు పాలొగొన్నారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములో ఇటీవల కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలు చోరికి గురవుతున్నాయి. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ఈ వాహనాల చోరీ కేసులో విషయంపై ప్రత్యేక శ్రద్ధను ఘనపరిచి కొన్ని టీములను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు టూవీలర్ ఇద్దరు దొంగలను అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలోని బడే షాప్ వీధికి చెందిన గుర్రంపాటి రాకేష్ రణదీప్, ధర్మవరం పట్టణానికి చెందిన బోయ వీధి కు చెందిన నీలి సతీష్ కుమార్, మేకల నరసింహులు రాబడిన సమాచారం మేరకు కూలి పని చేసుకుంటూ వీరు జీవనం కొనసాగించేవారని, మద్యం తో పాటు చెడు వ్యసనాలకు అలవాటు పడి చెడు వ్యసనాలను తీర్చుకొనుటకు వారు సంపాదన సరిపోనందున ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో పథకం ప్రకారం, ఇప్పటికీ రెండు నెలల క్రితం సాలే వీధి మాధవ నగర్, రాఘవేంద్ర స్వామి ఫంక్షన్ హాల్, పి ఆర్ టి వీధి తదితర ప్రదేశాలలో ఇంటి యందు పార్కు చేయబడిన ఏడు టీవీఎస్ ఎక్సెల్, ఒక అపాచీ బండిని దొంగతనం చేయడం జరిగిందని తెలిపారు. దొంగతనమునకు ఉపయోగించే ఒక కటింగ్ బ్లేడు ఒక వైరు కట్టర్లను వారి వద్ద నుండి స్వాధీనం పరచుకోవడం జరిగిందని తెలిపారు. పై ముగ్గురు ముద్దాయిలలో గుర్రంపాటి రాకేష్ రణదీప్ నీలి సతీష్ కుమారులను అరెస్టు చేసి వారి నుండి ప్రాపర్టీని స్వాధీన పరుచుకొని కోర్టుకు పంపడం జరిగిందని తెలిపారు. పై కేసు నందు రెండవ ముద్దాయి అయినటువంటి మేకల నరసింహులు అరెస్టు కావలసి ఉందని తెలిపారు. ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో పట్టణములోని శివానగర్ శివాలయం దగ్గర ఉన్న పాడుబడిన ఇంటి ముందర రాబడిన రహస్య సమాచారం కు వెళ్లి, సీఐ సుబ్రహ్మణ్యం తో పాటు ఏఎస్ఐ 1052, బీసీలు 707, 1498, 1499, 2998, 3638 సహాయముతో అరెస్టు చేయడం జరిగిందన్నారు. మొత్తం 12 ద్విచక్రాలను(విలువ రూ.5,05,000) స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి, కోర్టుకు పంపడం జరిగిందన్నారు. ఈ కేసును చేదించిన సీఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ పుట్టప్ప, కానిస్టేబుళ్లు వెంకటేష్ బయన్న అబ్దుల్లా, ఆది నారాయణ, నాగేశ్వరరావు లను డిఎస్పి శ్రీనివాసులు అభినందించారు.

కార్యసిద్ధి వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక దిమ్మెల సెంటర్, శివ నగర్‌లో వెలసిన కార్యసిద్ధి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సోమసుందరశర్మ వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి తొలుత వివిధ అభిషేకాలతో పాటు పట్టువస్త్రాలు, వివిధ పూలమాలలు, తులసి మాలలతో చేసిన అలంకరణ భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ నెలలో ప్రతి మంగళవారం, శనివారం రోజుల్లో భక్తాదుల ఆధ్వర్యంలో విశేష పూజలు, భజనలు, సంకీర్తనలు నిర్వహిస్తామని తెలిపారు.అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడమ భక్తాదుల పేరిటన, ఆలయ కమిటీ పేరిటన, పట్టణ ప్రజల తరఫున అర్చనలు నిర్వహించారు. ఇటీవలే హనుమాన్ జయంతి వేడుకలు దాతల సహాయ సహకారంతో విశేష పూజలతో పాటు వేలసంఖ్యలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆసక్తిగల దాతలు భక్తులు తమ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నీలూరి రామాంజనేయులు, కార్యదర్శి వేముల రమణారెడ్డి, కోశాధికారి నాగరాజు, సాయిప్రసాద్, కృష్ణారెడ్డి, పి.వి.చౌదరితో పాటు భక్తాదులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి సన్నాహాలు



విశాలాంధ్ర-అగళి : రాష్ట్రంలో బిజెపిని బలపరచడానికి కార్యవర్గసభ్యులు సమావేశంలో చర్చించినట్లు కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్ర శేఖర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన తరువాత రాజమహేంద్ర వరంలోని మంజీర టవర్స్‌లో రాష్ట్ర అధ్యక్షులు పురందరేశ్వరి అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించినట్లు అయన తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రివర్యులు మురుగన్, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌లు పాల్గొని మార్గదర్శనం చేశారు. రాష్ట్రంలో బీజేపీ భవి ష్యత్ కార్యాచరణ మెంబర్‌షిప్ నమోదు బూత్‌కమిటీలు, శక్తికేంద్రాల బలోపేతం గురించి వివరించడం జరిగిందన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు ఘనంగా సత్కరించి..సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డిని కలసి హిందూపురం, మడకశిర నియోజక వర్గాల్లో పార్టీని బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు అయన తెలిపారు. కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్, చంద్రశేఖర్, తిరుపతి జిల్లా ఇంచార్జ్ పీడీ పార్థసారథి, సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు వరప్రసాద్, హిందూపురం అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్ కుమార్, జిల్లా కార్యదర్శి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

13న రామకృష్ణమాచార్యుల వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కళాజ్యోతిలో(ఐసిఆర్ఆర్ సరస్వతీ నిలయం) ఈనెల 13న శనివారం సాయంత్రం 6:30 గంటలకు ఆంధ్రనాటక పితామహులు కీ.శే. ధర్మవరం రామకృష్ణమాచార్యుల వర్ధంతిసభను నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, రామకృష్ణ తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షులుగా.. కళాజ్యోతి సంస్థఅధ్యక్షులు కుంటిమల నారాయణ, ముఖ్య అతిథిగా కీ.శే. రామకృష్ణమాచార్యుల వారి మునిమనవళ్లు సాయిలత, సౌమ్య హాజరు అవుతున్నట్లు వారు తెలిపారు. తదుపరి ఇదే రోజు రాత్రి 7:30 గంటలకు 140 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వేంకటేశ్వర సురభి థియేటర్-సురభి జయచంద్ర వర్మ, హైదరాబాద్ బృందం వారిచే ఈనెల 13వ తేదీ శనివారం భక్త ప్రహల్లాద పౌరాణిక నాటకం, 14వ తేదీ ఆదివారం పాతాళభైరవి జానపద నాటకములు ప్రదర్శించబడునని వారు తెలిపారు.వర్ధంతి వేడుకలతో పాటు హైదరాబాద్ బృందం వారిచే నిర్వహించబడు ఈ నాటకములకు అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి, ఆస్వాదించి, విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

శ్రీపోతులయ్య..వీర దిమ్మమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సంగమేశ్వరం రోడ్డు తిక్కస్వామి నగర్ ఏడో వార్డులో వెలసిన శ్రీ పోతులయ్య స్వామి శ్రీ వీరదిమ్మమ్మతల్లి ఆలయ 24వ వార్షికోత్సవవేడుకలు భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతలయ్యస్వామి,వీర దిమ్మమ్మ తల్లికి ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ ఈవేడుకలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం వీర తిమ్మమ్మతల్లి, పోతలయ్యస్వామి ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు చెన్నైకి నూతన బస్సు సర్వీసు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం ఆర్టీసీ డిపో ద్వారా ధర్మవరం - చెన్నై సర్వీస్‌ను (వయా తిరుపతి నుండి చెన్నై) ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్‌యాదవ్ చేతులమీదుగా నేడు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు రీజినల్ మేనేజర్ మధుసూదన్, తదితర అధికారులు కూడా హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ధర్మవరం-చెన్నైకు ప్రయాణికుల కోరిక మేరకు ఈ నూతన సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రయాణికులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకొని ధర్మవరం డిపో అభివృద్ధికి సహకరించాలని వారు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని పోతుకుంట పంచాయతీలోని బృందావనం కాలనీకి చెందిన పవన్ కుమార్ (25) మద్యానికి బానిసై, అప్పులు చేసి, ఆఅప్పులు తీర్చలేక ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్యచేసుకున్నాడు. మృతి చెందిన పవన్ కుమార్ జల్సాలకు అలవాటు పడి మద్యానికి పూర్తిగా బానిస కావడం జరిగింది. తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. కానీ మద్యం బానిస కావడం, అప్పులు తీర్చలేక, క్షణికమైన ఆవేశంలో ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబాన్ని ఎంతగానో బాధించింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వాసవి మాతకు ఆభరణాలతో అలంకరణ

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక కెపిటి వీధిలోని వాసవి దేవాలయంలో ఆషాడమాసం మొదటి మంగళవారం పురస్కరించుకొని శ్రీవాసవి మహిళామండలి ఆధ్వర్యంలో వాసవిమాతకు ప్రత్యేక పూజలు, అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నారాయణ మూర్తిలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో వివిధ రకాలుగా అమ్మవారిని అలంకరణ కార్యక్రమం చేపడుతున్నారు. అమ్మవారికి వాసవి మహిళా మండలి కమిటీ వారు, ఆర్యవైశ్య మహిళలు కలిసి ఆభరణాలను వాసవి మాతకు అలంకరించిన వైనం అందరినీ ఆకట్టుకుంది. తొలుత వాసవి మాతకు అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు ఆర్యవైశ్య సంఘం, వాటి అనుబంధ సంస్థల యొక్క పేర్లతో అర్చనలు కూడా కొనసాగించారు. తదుపరి ఆర్యవైశ్య మహిళలు లక్ష్మీశోభాని పారాయణం, సాముహిక వాసవి సంకీర్తనలు నిర్వహించారు. వాసవి మాత ఆభరణాల అలంకరణ భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి ఉపాధ్యక్షులు తబ్బుల వాణి కలవల శ్రీదేవి, కార్యదర్శి కాకుమాని కళ్యాణి, వాసవి మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం దాని అనుబంధ సంస్థల వారు పాల్గొన్నారు.